క్లుప్తంగా

నిరాశ్రయుల వసతి గృహాల సందర్శన



షెల్టర్ హోం నిర్వాహకులతో రోడా మిస్త్రీ కాలేజీ విద్యార్థులు

సీతమ్మధార: జీవీఎంసీ ఏయూటీడీ వసతి గృహాల ద్వారా అభాగ్యులకు అందజేస్తున్న సేవల గురించి తెలుసుకునేందుకు శుక్రవారం 23 మంది రోడామిస్త్రీ సోషల్ వర్క్ కాలేజీ విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు వసతి గృహాలను సందర్శించారు. గత 14 ఏళ్లగా జీవీఎంసీతో కలిసి ఏయూటీడీ చేస్తున్న సేవలు, నిరాశ్రయులను గుర్తించి షెల్టర్లకు తరలిస్తున్న వైనం, వైద్య సేవలు, బాధితులను వారి కుటుంబ సభ్యుల చెంతకు చేరుస్తున్న వైనం గురించి ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వారికి వివరించారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సిబ్బంది జ్యోతిర్మయి, లీల, శ్రీను, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

5న భారీ కార్మిక ప్రదర్శన



వివరాలు వెల్లడిస్తున్న సీఐటీయూ నాయకులు

అల్లిపురం: కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్స్ రద్దుకు ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శనలు చేపట్టనున్నట్లు సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ తెలిపింది. జిల్లాలో కార్మికులు భారీగా హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ సీనియర్ ప్రధాన కార్యదర్శి వరకూటి రాజు, జి.అప్పలరాజు పాల్గొని వివరాలు వెల్లడించారు.

వాసుపల్లికి వైఎస్సార్‌సీపీ నాయకుల సత్కారం



వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వైఎస్ఆర్‌సీపీ నాయకుల కృషికి మెచ్చి పార్టీ పదవులు ఇచ్చింది. ఈ మేరకు సౌత్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సువార్తరాజు (వాసర్ల సుబ్రహ్మణ్యం), పబ్లిక్ వింగ్ ప్రచార కమిటీకి జీరు సూర్యనారాయణను పార్టీ ఎంపిక చేసింది. ఈ మేరకు వారు నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌కు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీకి, వార్డు అధ్యక్షుడు కనకరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గజమాలతో వాసుపల్లిని సత్కరించారు.

ఘనంగా పంచమ వార్షికోత్సవం



విశేష అలంకరణలో విజయ గణపతి

అల్లిపురం: మెయిన్ రోడ్డులో ఉన్న విజయ గణపతి ఆలయం పంచమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 నుంచి బీఆర్ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ కమిటీ, ఆలయ ధర్మకర్త పట్నాల లక్ష్మి, రమణమూర్తి ఆధ్వర్యంలో గణపతికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం దేవాలయం వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మత్తు ముప్పు

మత్తు పదార్థాల సేవనం ముప్పు తెస్తుందని ప్రభుత్వ ప్రకటనల్లో పేర్కొంటూ ఉంటారు. కోట్లు ఖర్చు చేసి ప్రకటనలు గుప్పిస్తుంటారు. గుట్కా, ఖైనీ, సిగరెట్ వినియోగం తగదంటూ వాటిలో పేర్కొంటూ ఉంటారు. అయితే ఇదేమీ సత్ఫలితాలు ఇస్తున్నట్లు కనిపించదు. ఎక్కడ చూసినా వాటి వినియోగం యథేచ్ఛగా జరిగిపోతుంది. సినిమా ప్రదర్శనల ముందు, టీవీల్లో మత్తు పదార్థాలు సేవిస్తూ ప్రముఖ హీరోల యాడ్స్ వచ్చి పోతుంటాయి. ఆ స్ఫూర్తితో యువత మత్తు పదార్థాల వినియోగం వైపు ఆకర్షితులు అవుతూనే ఉన్నారు.



జగదాంబ: మత్తు పదార్థాల విక్రయంపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడం వల్ల వాటి విక్రయం యథేచ్ఛగా జరిగిపోతోంది. కిళ్లీ బడ్డీలు మొదలు కొని, చిన్నచిన్న కిరాణా దుకాణాల్లో సైతం ఖైనీ, గుట్కాలు దొరుకుతున్నాయి. దక్షిణలోని పలు ప్రాంతాల్లో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వృద్ధుల నుంచి యువత వరకు అందరు వీటిని పెద్ద ఎత్తున వినియోగిస్తు మృత్యువాత పడుతున్నారు. గతంలో గుట్కాలపై దాడులు జరగడంతో వ్యాపారులు భయపడి అమ్మకాలకు వెనకడుగు వేసేవారు. అయితే కొన్ని రోజులుగా దాడులు లేకపోవడంతో మత్తు పదార్థాలు ఎక్కడ పడితే అక్కడ లభ్యమవుతున్నాయి.



చిత్తు చేసే మత్తు పదార్థాలు



నచ్చినట్లు రేట్లు..

గతంలో గుట్కా ప్యాకెట్ రూ.2కి విక్రయించేవారు. నిషేధం తర్వాత దాని ధర ఊహించనంతగా పెరిగిపోయింది. కొన్నిచోట్ల రూ. 10కి, కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువకు కూడా విక్రయిస్తున్నారు. ఖైనీ ధరలు మాత్రం బ్రాండ్‌కు ఒక్కోలా ఉన్నాయి. అవి కూడా ఎలా లేదన్నా రూ. 30 నుంచి రూ. 40 వరకు విక్రయిస్తున్నారు.

సరఫరా ఇలా..

గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థాలు పెద్ద ఎత్తున హోల్‌సేల్ వ్యాపారుల నుంచి చిన్నచిన్న వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. వాటిని ద్విచక్ర వాహనాలపై బ్యాగుల్లో పెట్టుకుని కిరాణా షాపులు, బడ్డీలకు విక్రయిస్తుంటారు. డిమాండ్‌ను బట్టి వాటి ధరలు ఉంటాయి. కొన్ని షాపుల్లో ఒక ధర.. మరికొన్ని షాపుల్లో మరో ధరకు వీటిని విక్రయిస్తున్నారు.

గుట్కాతో నోటి క్యాన్సర్..



గుట్కా తింటే నోటి, గొంతు క్యాన్సర్ వస్తుంది. జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. పళ్ల గార పట్టడంతో పాటు నాలుక రుచి పోతుంది.
– డాక్టర్ సందేశ్, వైద్యాధికారి, ప్రసాద్ గార్డెన్స్ పీహెచ్‌సీ.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఘనంగా వాసుపల్లి జన్మదిన వేడుకలు



సూర్యనారాయణను అభినందిస్తున్న వాసుపల్లి



వాసుపల్లిని సత్కరిస్తున్న సనపల రవీంద్ర భరత్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆశీలమెట్ట దరి ఆయన కార్యాలయంలో ఆయనను నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, పార్టీ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు తాడి రవితేజ, ఎస్సీ సెల్ ఆకుల శ్యాంకుమార్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాసర్ల సుబ్రహ్మణ్యం, వాణిజ్య విభాగం కడియం ప్రసాద్, కల్చరల్ విభాగం అధ్యక్షుడు పెనుగొండ సూర్యనాయుడు, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు జి.సూర్యనారాయణ, బూత్ కమిటీస్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వాసుపల్లికి శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకు వస్తామన్నారు. జగనన్న ప్రభుత్వంలో పేద, సామాన్య ప్రజలు ఎంతో ఆనందంగా ఉండేవారన్నారు. వార్డు నాయకులు అలపన కనకరెడ్డి, పీతల వాసు, ఎం.రమేష్, భీశెట్టి ప్రసాద్, ముజీబ్‌ఖాన్, బెవర మహేష్, ఆకుల శ్యామ్, సూర్య, సాగర్, శివ అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లికి కృతజ్ఞతలు..

మహారాణిపేట: తనకు పదవి ఇచ్చి ఉన్నతి కల్పించిన వారికి జీవితాంతం రుణపడి ఉంటానని వైఎస్సార్‌సీపీ దక్షిణ అసెంబ్లీ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



వాసవీ మాత ఊరేగింపులో పాల్గొన్న ఆర్యవైశ్య దంపతులు



వాసవీ మాతను కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, వాసవీ సమాజం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ చైతన్య ఫౌండేషన్, వైశ్య స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు నగరంలో గల అన్ని వాసవీ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. అలాగే ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము 3 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక క్షీరాభిషేకం, ఉదయం 6.30 గంటలకు టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు 102 మంది ఆర్యవైశ్య దంపతులచే వివిధ రకాల పుష్పాలతో ఊరేగింపు నిర్వహించారు. 7.30 గంటలకు మూల విరాట్టుకు ప్రత్యేకంగా ఆత్మార్పణ అలంకరణ, ఉత్సవ విగ్రహానికి భక్తులచే స్వయంగా క్షీరాభిషేకం, 8 గంటలకు స్వర్ణ పుష్పార్చన, సహస్రనామ కుంకుమార్చన, 102 దీపాలతో మంగళ హారతి, 10.30 గంటలకు వాసవీ మూల మంత్రహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమా వెంకట బాలాజీకుమార్, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు, చైర్మన్ కట్టమూరి సూర్యనారాయణ, కో చైర్మన్ దుర్గా నూకేశ్వరరావు, పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారిని దర్శించుకున్న పైడా, కంకటాల..

విశాఖ సిటీ: శ్రీ వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీ అమ్మవారిని పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఈ ఏడాది నుంచి రాష్ట్ర పండగగా నిర్ణయించడం గొప్ప విషయమని పైడా, కంకటాల పేర్కొన్నారు. తిరుపతి, విజయవాడ, అన్నవరం, సింహాచలం వంటి ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనుండడం వైశ్యులందరికీ గర్వ కారణమని పేర్కొన్నారు.

శేష జీవితం ఆనందంగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన వారితో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తదితరులు

అల్లిపురం: జీవీఎంసీలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి అన్నారు. సంస్థలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన 11 మంది జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారు సుదీర్ఘ కాలం ఎన్నో సేవలందించారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ సొమ్మును రూ.67,05,732 అందించారు. ఈ కార్యక్రమంలో జోన్-1 జోనల్ కమిషనర్ ఎంవీడీ ఫణిరామ్, యూసీడీ పీడీ పీఎం సత్యవేణి, పర్యవేక్షక ఇంజినీర్లు శాంసన్ రాజు, సంపత్‌కుమార్, గోవిందరాజులు, కార్యనిర్వాహక ఇంజినీర్లు లక్ష్మోజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడు, సూపరింటెండెంట్లు రియాజ్, వి.సన్యాసిరావు, మణిభూషణ్, హెన్నా, తేజవతి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సభ్యులు అనిల్‌కుమార్, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

6న లీన్ తయారీపై వర్క్ షాప్

అల్లిపురం: ఈ నెల 6వ తేదీన పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదురుగా గల ది వైజాగ్‌పట్నం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్‌లో లీన్ తయారీ, జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్‌పై అవగాహన వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, జీరో డిఫెక్ట్ కన్సల్టెంట్స్ సహకారంతో ఈ వర్క్‌షాప్ ద్వారా లీన్ తయారీ సూత్రాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇది పరిశ్రమల ఉత్పాదకతను మెరుగుపరచడానికి, వ్యర్థాలను తగ్గించడానికి సహాయపడుతుందన్నారు. ఈ వర్క్‌షాపులో పాల్గొనదలచిన వారు 9391422821 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న భవనం



75 ఫీట్ రోడ్డులో ఊగిసలాడుతున్న భవనం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని 75 ఫీట్ రోడ్డులో ఇటీవల నూతన నిర్మాణాల కోసం రెండు భవనాలు నేల కూల్చారు. అయితే ఈ రెండు భవనాల మధ్య ఉన్న ఓ భవనం కాలం చెల్లిపోవడంతో ఊగిసలాడుతూ నేడో రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. నిత్యం జనసంచారం ఉండే ఈ ప్రాంతంలో ఇది ఎప్పుడు కూలిపోతుందోనని అక్కడి వ్యాపారులు, సమీపంలో ఉన్న భవనాల యాజమానులు భయందోళనలకు గురవుతున్నారు. అలాగే ఈ ప్రాంతం నుంచి పోర్టుకు వెళ్లే వాహనాల వల్ల భవనం పునాది ఊగిపోతోందని చూసిన వారు చెబుతున్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని ఆ భవనాన్ని కూల్చివేయకపోతే పెద్ద ప్రమాదం తప్పదని జరుగుతుందని చెబుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

సీతంపేట: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి అన్నారు. క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మార్చి 7న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను శుక్రవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఈవెంట్ ఆర్గనైజర్ ఎం.ఉషారాణి, మను చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మనుపల్ల, భీమరశెట్టి మాధురి, అల్మా, ఝాన్సీరాణి, కుష్బూ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న మహిళలను స్ఫూర్తిదాయక అవార్డులతో సత్కరిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 7842227101 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

అల్లిపురం: పంచగ్రామాల భూ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటరావు, యు.రాజుతో కలిసి శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంచగ్రామాల సమస్య పరిష్కరించనున్నట్లు ప్రకటించడం శుభ పరిణామమన్నారు. దీనిని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ స్వాగతిస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు కూడా జీవోలు విడుదల చేశాయన్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం పంచగ్రామాల సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వ్యాపారుల నిర్లక్ష్యం.. వాహన చోదకులకు శాపం



సరస్వతీ పార్కు వద్ద వాడుక నీటిని రోడ్డుపై పోసిన దృశ్యం



గాయపడిన విద్యార్థులకు సపర్యలు చేస్తున్న సహ విద్యార్థులు, స్థానికులు

అల్లిపురం: సరస్వతీ పార్కు చుట్టు పక్కల గల మిల్క్ పార్లర్లు, పండ్ల దుకాణాల యజమానుల నిర్లక్ష్యం వాహన చోదకులకు శాపంగా మారింది. వారు తమ దుకాణాల్లోని వ్యర్థాలతో కూడిన నీటిని డ్రైనేజీలో కాకుండా రోడ్డు మధ్యలో పారబోయటంతో శుక్రవారం పలువురు వాహన చోదకులు, విద్యార్థులు జారిపడి గాయాల పాలయ్యారు. ముగ్గురు విద్యార్థులు వాహనంతో పాటు జారిపడ్డారు. అదే సమయంలో అటుగా వస్తున్న స్కూలు బస్సు డ్రైవర్ బ్రేక్ వేయటంతో విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి నిత్యం వాడుక నీటిని నడిరోడ్డుపై పోస్తున్న సరస్వతీ పార్కు చుట్టుపక్కల గల మిల్క్ పార్లర్, ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు, హోటళ్ల యాజమాన్యాలపై జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని సరస్వతీ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాహన చోదకులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మెలగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

అల్లిపురం: చక్కగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మెలగాలని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు విద్యార్థులకు సూచించారు. ఎంవీడీఎం హై స్కూల్లో శుక్రవారం ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలికలకు వివరించారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడరాదన్నారు. త్వరలోనే టెన్త్ పరీక్షలు జరగనున్న సందర్భంగా విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఎవరైనా విద్యార్థినులు, విద్యార్థులను ఏడిపిస్తే తక్షణమే తన నంబరు (9440796019)కు ఫోన్ చేసి తెలపాలన్నారు. తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటానన్నారు. పోలీసుల సేవలు వినియోగించుకోవాలన్నారు.

మద్యం నోటిఫికేషన్‌ను సవరించాలి

డాబాగార్డెన్స్: మద్యం షాపుల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో శ్రీశయన కులం విషయంలో సవరణ చేయాలని విశాఖ శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శ్రీశయన, సెగిడి ఒకే కులమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మద్యం నోటిఫికేషన్‌లో మాత్రం ఆ రెండు పేర్లతో వేర్వేరు కులాలు ఉన్నట్లు తెలియజేశారన్నారు. దీంతో దరకాస్తు చేసేటప్పుడు ప్రత్యేకంగా అధికారులు సెగిడి కులం సర్టిఫికెట్ అడుగుతున్నారన్నారు. దీంతో సెగిడి కులం వారు దరఖాస్తు చేసుకోవడానికి ఆటంకంగా మారిందన్నారు. రెండు పేర్లతో చేసిన దరకాస్తులను అనుమతించే విధంగా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

• ప్రమాదమని తెలిసినా..



చావుల మదుం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో రోడ్డు పనుల కోసం తవ్వకాలు జరిపారు. పనులు మధ్యలో వదిలేయడం వల్ల రోడ్డు ఇరుగ్గా మారి ప్రమాదకరంగా తయారయింది. అయితే ఆ విషయం పట్టించుకోకుండా చిరువ్యాపారులు అక్కడే తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఆ పక్కనే టిఫిన్ సెంటర్ నిర్వహిస్తుండగా.. టిఫిన్ చేయడానికి వచ్చిన వారితో ఆ ప్రాంతం గందరగోళంగా తయారయింది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం